కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..)టమాటా.15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 8, క్యారెట్ 19, దొండ 28, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 27, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 75, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నిఘా నీడలో బోయిన్‌పల్లి

సీసీ కెమెరాలు ప్రారంభించిన డీసీపీ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాల్, పోలీసు అధికారులు

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధి మొత్తం నిఘా నీడలోకి వచ్చింది. ప్రధాన రహదారుల్లో 123 అత్యాధునిక పరిజ్ఞానం కలిగిన కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. 80 కెమెరాలు 50 మీటర్ల వరకు రికార్డు చేయగలిగేవి, మరో 40 కెమెరాలు జూమ్ సదుపాయం కలిగినవి. ఇక మూడు ప్రధాన చౌరస్తాల్లో ఆటోమెటిక్ నంబర్ ప్లేట్ రికగ్నయిజేషన్ (ఏఎన్‌పీఆర్) టెక్నాలజీ కలిగిన కెమెరాలు ఏర్పాటు చేశారు. జెమినీ ఈడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ లిమిటెడ్ (ఫ్రీడమ్ ఆయిల్) సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) నిధుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాల్ బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఆయా కెమెరాల సీసీ ఫుటేజీని నిరంతరం పరిశీలిస్తూ, అవసరమైన ఫీడ్‌ను తీసుకునేలా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సైతం బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రం అందజేత

అడ్డగుట్ట: అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన యాదగిరి కుమారుడు అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈ మేరకు స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి విషయాన్ని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన బాధితుడి చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించగా 3.50 లక్షలు మంజూరు అయినట్లు కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. బుధవారం బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధికి సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాలను ఆమె అందజేశారు.

బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్టు

అమీర్‌పేట: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. అమీర్‌పేట ఏషియన్ సత్యం మాల్ సమీపంలో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారనే సమాచారంతో సాయంత్రం దాడి చేశారు.సినీ పరిశ్రమలో బౌన్సర్‌గా పనిచేస్తున్న ప్యాత గౌడ్ రవితేజను అరెస్టు చేశారు. లోటస్ 99 అనే వెబ్‌సైట్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు నిర్ధారించారు. నిందితుడి సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పథకం ప్రకారమే అంతమొందించాడు

బావమరిది హత్య కేసులో బావ రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రమేష్

సికింద్రాబాద్: బావమరిదిని హత్య చేసిన కేసులో నిందితుడైన బావ జాన్ అనిల్ లూథరస్‌ను వారాసిగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ రమేష్‌తో కలిసి ఏసీపీ జైపాల్ రెడ్డి బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ముషీరాబాద్‌కు చెందిన లూథరస్, శ్యాంసన్ రాజు ఇరువురు సొంత బావ, బావమరుదులు. లూథరస్ ఒక ప్రైవేటులో రికవరీ ఏజెంట్ గా పని చేస్తుండగా, శాంసన్ రాజు రాంనగర్ చేపల మార్కెట్ లో కూలీపని చేసేవాడు. ఈ నెల 27న శ్యాంసన్ రాజు పార్సీగుట్ట చౌరస్తాలో స్నేహితుడితో మద్యం సేవిస్తుండగా అక్కడే ఉన్న బావ లూథరస్‌తో గొడవ పడ్డాడు. తర్వాత అంతా అక్కడి నుండి వెళ్లిపోయారు. సాయంత్రం లూథరస్ మద్యం సేవించడానికి అదే ప్రదేశానికి వెళ్ళగా, శ్యాంసన్ రాజు అతని వద్దకు వెళ్లి, ర్భాషలాడడంతోపాటు అతనిపై దాడి చేశాడు. అంతేకాకుండా అతన్ని, అతని కుటుంబ సభ్యులను చంపేస్తానని బెదిరించాడు. దాంతో తిట్టింది సొంత బావమరిదే అనే విషయం మర్చిపోయి పగ పెంచుకుని శ్యాంసన్‌రాజుకు హతమార్చాలనుకున్నాడు. ఇంటికి వెళ్లి ఒక ఇనుప రాడ్‌ను తీసుకువచ్చి శ్యాంసన్ రాజుకు ఫోన్ చేసి మద్యం తాగడానికి రమ్మని పిలిచాడు. శ్యాంసన్‌రాజు మరో ఇద్దరు స్నేహితులతో కలిసి తాగారు. రాత్రి 11 గంటలకు తీవ్రమైన మత్తులోకి వెళ్లిన శ్యాంసన్‌రాజును లూథరస్ అప్పటికే వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్ తో కొట్టి చంపినట్లు పోలీసులు తెలిపారు.

ఊరెళ్తే.. జర జాగ్రత్త..!



వేసవిలో దొంగలకు ఆస్కారమివ్వకండి.. • జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పోలీసులు..

సనత్‌నగర్: బేగంపేటకు మయూరి మార్గ్‌కు చెందిన బాల్‌రెడ్డి, కమల దంపతులు వేసవి కదా అని తలుపులు తెరిచి నిద్రపోయారు. ఇదే అదునుగా భావించిన ఓ దొంగ నిద్రపోతున్న కమల మెడలోని రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు.

- సనత్‌నగర్ మోతీనగర్‌కు చెందిన కూరగాయల వ్యాపారి భోగేశ్వరరావు తన స్వగ్రామానికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి గుర్తుతెలియని వ్యక్తులు రూ.1,85,000ల చోరీ చేసిన ఘటన వెలుగు చూసింది.
- జెక్‌కాలనీ చల్లాఫ్రైడ్ అపార్ట్‌మెంట్‌కు చెందిన అడుసుమిల్లి సాయిశ్రీలేఖ ఇంట్లో రూ.40 వేలు విలువ చేసే బంగారు పుస్తెలతాడును దొంగిలించుకుపోయారు.
- ఇలా వేసవి కాలంలో దొంగలు అదును చూసి చోరీలకు పాల్పడుతున్నారు. వేసవి వచ్చిందంటే పిల్లలకు సెలవులు ఆవ్వడంతో సాధారణంగా పిల్లా పాపలతో స్వగ్రామాలకు వెళ్లడమో..విహారయాత్రలకు పయనమవడమో చేస్తుంటారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని సనత్‌నగర్, అమీర్‌పేట, బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట ప్రాంతాల్లో స్థిరపడ్డ వారిలో ఎక్కువ శాతం స్థానికేతరులే. వివిధ ప్రాంతాలు, వివిధ రాష్ట్రాల నుంచి వలసవచ్చిన వారే. ఈ క్రమంలో సెలవుల్లో అమ్మమ్మలు, నాన్నమ్మలు, తాతయ్యల వద్దకు వెళ్లేందుకు చాలామంది ఇష్టపడుతుంటారు. దొంగలు ఇదే అవకాశంగా భావించి తాళాలు వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని చేతివాటం ప్రదర్శిస్తుంటారు. ఎక్కువ రోజులు ఇల్లు విడిచి వెళ్లాల్సిన పరిస్థితుల దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు పోలీసులు. దొంగలకు చిక్కకుండా నగదు, సొత్తును భద్రపరచుకోవాలని సూచిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు పలు సూచనలు చేస్తున్నారు.
- నగలు, నగదును ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో గానీ, వెంట తీసుకువెళ్లడమో గానీ, బాగా తెలిసిన, నమ్మకస్తుల వద్ద ఉంచితే మంచిది.

ఇళ్లకు సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ అమర్చుకోవడం ఉత్తమం

- సెలవుల్లో ఊర్లకు వెళ్లేవారు విధిగా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడం ద్వారా ఆ ప్రాంతంలో పోలీసు గస్తీ పెంచేందుకు అవకాశం ఉంటుంది.
- ఇళ్లకు సీసీ కెమెరాలు ఉన్నట్లయితే ఎప్పకప్పుడు ఆన్‌లైన్‌లో పర్యవేక్షిస్తూ ఉండాలి.
- తాళం చెవులను ఎప్పుడూ కూడా ఇంటి ఆవరణలో, పరిసర ప్రాంతాల్లో పెట్టకూడదు.
- ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం వేసినట్లుగా కనిపించకుండా ఉండేలా డోర్ కర్టెన్లు వేయాలి.
- ఇల్లు అద్దెకు కావాలంటూ వివిధ కారణాలు చెప్పి ఇళ్లకు వచ్చేవారి పట్ల జాగ్రత్తగాఉండాలి.
- గుర్తుతెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించినట్లయితే 100కు డయల్ చేయాలి.
- ఆరుబయట వాహనాలు పార్కింగ్ చేసినట్లయితే వాటికి హ్యాండిల్ లాక్‌తో పాటు వీల్ లాక్ కూడా వేయడం మంచిది.
- వేసవి దృష్ట్యా చల్ల గాలుల కోసం రాత్రివేళల్లో ఆరుబయట గానీ, భవనాలపై గానీ, తలుపులు ఓపెన్ చేసి పడుకోవడం గానీ చేయకూడదు.
- పాలవాళ్లకు, పేపర్‌బాయ్స్‌కు ముందే వద్దని చెప్పాలి. లేనిపక్షంలో పేపర్లు, పాలప్యాకెట్లు ఇళ్ల ముందు పేరుకుపోయి ఇంట్లో ఎవరూ లేరన్న భావనకు వస్తారు.

సనత్‌నగర్ నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్ల నెంబర్లు

సనత్‌నగర్ :	94906 17132
ఎస్సార్‌నగర్:	87126 60499
బేగంపేట:	87126 60280
రాంగోపాల్‌పేట:	87126 60180
మహంకాళి:	87126 60240
మార్కెట్:	87126 60250
గోపాలపురం:	87126 60210
గాంధీనగర్:	87126 60140

అపార్ట్‌మెంట్లకు నమ్మకమైన వాచ్‌మెన్లు పెట్టుకోవాలి



ఎక్కువ రోజులు సెలవులపై వెళ్లేవారు సమాచారం ఇవ్వడం ద్వారా ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ పెంచేందుకు అవకాశం ఉంటుంది. విలువైన వస్తువులను బ్యాంకర్లలో గానీ, తెలిసిన వారి వద్ద గానీ పెట్టుకోవడం మంచిది. అపార్ట్‌మెంట్ల వద్ద నమ్మకమైన వాచ్‌మెన్లను పెట్టుకోవాలి. గేటెడ్ కమ్యూనిటీలో సెక్యూరిటీ పెట్టుకుని స్వతహాగా నైట్ పెట్రోలింగ్ పెట్టుకోవడం మంచి పద్ధతి. – శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్, సనత్‌నగర్

పలువురు ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం..

సనత్‌నగర్: పోలీస్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ నగర కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధి కిందికి వచ్చే లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలోని ఇన్‌స్పెక్టర్లు పెద్ద ఎత్తున బదిలీ అయ్యారు.

- గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రాజు డాగులను ఆసిఫ్‌నగర్ డీఐగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ బదిలీ అయ్యారు.
- గోపాలపురం ఎస్‌హెచ్‌ఓ నరేష్‌ను వెస్ట్‌జోన్ పీసీఆర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో అఫ్జల్‌గంజ్ డీఐ మధుకుమార్ మేకల బదిలీపై రానున్నారు.
- బేగంపేట పోలీస్‌స్టేషన్ డీఐగా మధుసూదన్ రెడ్డిని వారాసిగూడ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ బదిలీపై రానున్నారు.
- టీటీఐ బేగంపేట ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న రాంచందర్‌ను మార్కెట్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ట్రాఫిక్ అడ్మిన్‌గా అటాచ్‌లో ఉన్న అశోక్‌నాగులకు బాధ్యతలు అప్పగించారు.
- మార్కెట్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రాఘవేందర్‌ను గుడిమల్కాపూర్ డీఐగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ బదిలీపై రానున్నారు.
- రాంగోపాల్‌పేట డీఐగా అటాచ్‌లో ఉన్న గోపి రాతును చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో సెక్రటేరియట్ సెక్యూరిటీ నుంచి విక్రంసింగ్ బదిలీపై రానున్నారు.
- గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాములును లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో మారేడ్‌పల్లి ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ భాస్కర్ జట్టుకు బాధ్యతలు అప్పగించారు.
- ఎస్సార్‌నగర్ డీఐగా ఉన్న గోపాల్ మందగిరిని ట్రాఫిక్ అడ్మిన్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో హెడ్ ఆఫీస్ సెంట్రల్ కాంప్‌లెట్ సెల్ నుంచి శ్రీకాంత్ బదిలీపై రానున్నారు.
- బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్యను మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ డీఐగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ట్రాఫిక్ అడ్మిన్‌గా ఉన్న రమేష్ ఆకుల బదిలీపై రానున్నారు. అలాగే సైదాబాద్ ఎస్‌హెచ్‌ఓ రాఘవేందర్‌కు బేగంపేట ట్రాఫిక్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు.
- ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులును చార్మినార్ పోలీస్‌స్టేషన్ డీఐగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో బేగంబజార్ ఎస్‌హెచ్‌ఓ విజయ్‌కుమార్ బదిలీపై రానున్నారు.
- మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్‌ను డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ డీఐగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో బహదూర్‌పురా ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ బదిలీపై రానున్నారు.
- గాంధీనగర్ డీఐగా అటాచ్‌లో ఉన్న పెండ్యాల జయశంకర్‌ను మార్కెట్ పోలీస్‌స్టేషన్‌గా డీఐగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో నాంపల్లి డీఐగా అటాచ్‌లో ఉన్న సైదేశ్వర్‌కు బాధ్యతలు అప్పగించారు.
- మహంకాళి డీఐగా గత ఏడాది ఆగస్టు 28 నుంచి సస్పెన్షన్‌లో ఉన్న కేసరి ప్రసాద్‌ను అదే పోలీస్‌స్టేషన్ డీఐగా బాధ్యతలు అప్పగించారు.

కంటోన్మెంట్ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు సభ్యురాలు భానుక నర్మద

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధే లక్ష్యంగా పార్టీలకు అతీతంగా ముందుకు సాగుదామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ పిలుపునిచ్చారు. కంటోన్మెంట్ ఆరోవార్డు జూపిటర్ కాలనీలో రూ.35 లక్షల బోర్డు నిధులతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులకు బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానిక ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన బోర్డు నిధులకు తోడుగా తాను రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు రాబడతానన్నారు. ఇటీవలే రూ.10 కోట్ల ప్రత్యేక గ్రాంటును బోర్డుకు తెప్పించానన్నారు. మరో రూ.25 కోట్ల మేరకు నిధులు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో పాలన సాగే కంటోన్మెంట్‌కు ఎంపీ ఈటెల రాజేందర్ సైతం తనవవంతు నిధులు కేటాయిస్తే బాగుంటుందన్నారు.

సోదరి– సోదరుల్లా మాట్లాడుకుందాం..

కంటోన్మెంట్ అభివృద్ధి కోసం తాను ఎలాంటి భేషజాలు లేకుండా ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో కలిసి పని చేసేందుకు సిద్ధమని బోర్డు సభ్యురాలు భానుక నర్మద అన్నారు. ఓ అన్న – చెల్లి మాదిరిగా కలిసి మాట్లాడుకుని అభివృద్ధిలో కలిసి సాగుదామన్నారు. ఏడాదిలో కంటోన్మెంట్‌లో సుమారు రూ.15 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కూడా మీరు రాష్ట్ర ప్రభుత్వం నుండి పెద్ద ఎత్తున నిధులు తెచ్చి కంటోన్మెంట్ అభివృద్ధికి కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బాణాల శ్రీనివాస్ రెడ్డి, డి.సంజయ్ బాబు, బాలస్వామి పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో ఉపశమనం



ఫిజియోథెరపీ పరికరాల విభాగాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి

గాంధీఆస్పత్రి: ఫిజియోథెరపీతో అనేక రకాల రుగ్మతలు, శారీరక బాధల నుండి ఉపశమనం లభిస్తుందని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్‌ఎస్ రాజకుమారి అన్నారు. సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి ఓపి భవనంలోని ఫిజియోథెరపీ విభాగంలో దాతల సహాయంతో ఏర్పాటుచేసిన నూతన పరికరాలను ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య రంగంలో ఫిజియోథెరపీ కీలకమన్నారు. ఆధునిక పద్ధతులు అత్యాధునిక వైద్య యంత్రాల సాయంతో అనేక రకాల రుగ్మతలు, కీళ్లనొప్పులు శారీరక బాధలను నియంత్రించవచ్చని అన్నారు. లక్షలాది రూపాయల వ్యయంతో పరికరాలను ఏర్పాటుచేసిన దాతలను అభినందించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సుబోత్ కుమార్, ఆర్థోపెడిక్ హెచ్ ఓ డి డాక్టర్ వాల్య, ఆర్ ఎం ఓ శేషాద్రి, ఫిజియోథెరపీ వైద్యులు రమేష్ పాల్గొన్నారు.

శభాష్..స్టూడెంట్స్

సనత్‌నగర్: ఎస్సెస్సీ ఫలితాల్లో సర్కారీ స్కూల్ విద్యార్థులు మెరిశారు. విద్యాశాఖ సికింద్రాబాద్ జోన్ 15 ఉన్నత పాఠశాలల్లో బండిమెట్ స్కూల్ విద్యార్థి పాలకల్లు తేజ శ్రీనివాస కృష్ణ 547 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మండల టాపర్‌గా నిలిచాడు. తండ్రి గోల్డ్‌స్మిత్ కాగా కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చదివించారు. తేజ శ్రీనివాస కృష్ణ కష్టపడి అత్యధికంగా 547 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గానే కాకుండా మండల టాపర్‌గా కూడా నిలిచాడు.

- నల్లగుట్ట (ఓల్డ్) ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన సమీనా బేగం 543 మార్కులు సాధించింది. అలాగే బాలంరాయి నల్లగుట్ట స్కూల్ విద్యార్థిని దయ్యాల తేజశ్రీ..బన్సీలాల్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి రవి శంకర్ తివారీలు 534 మార్కులు చొప్పున సాధించారు.
- బాలానగర్ మండల పరిధి కిందికి వచ్చే సనత్ నగర్ రౌండ్‌టేబుల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 67 శాతం ఉత్తీర్ణత సాధించారు. 540 మార్కులతో ఇందు స్కూల్ టాపర్‌గా నిలవగా, 531 మార్కులతో హాసిని రెండో స్థానంలో నిలిచింది.
- ఇదే మండల పరిధిలోని అశోక్‌కాలనీలో గల సనత్‌నగర్ (ఓల్డ్) ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 73 శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల టాపర్‌గా 526 మార్కులతో సాయికృతి, 515 మార్కులతో సరస్వతీ ద్వితీయ స్థానంలో నిలిచింది.



తేజ శ్రీనివాస కృష్ణ (547)



సమీనాబేగం (543)



తేజశ్రీ (534) రవిశంకర్ (534) ఇందు (540) హాసిని (531) సాయికృతి (526)

సీఎం హామీతో ఉస్మానియాలో సమ్మె విరమణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాలను పర్మనెంట్ చేయమని, ఉద్యోగ భద్రత, యూజీసీ పే స్కేల్ అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీతో వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం విరమించారు. గత 12 రోజులుగా రాష్ట్రంలోని 12 వర్సిటీలలో విధులు బహిష్కరించి కాంట్రాక్టు అధ్యాపకులు చేస్తున్న నిరవధిక సమ్మె పై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఓయూలో 25 ఏండ్లుగా తక్కువ వేతనానికి పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు ఉద్యోగాల పర్మనెంట్ కోసం దీర్ఘకాలంగా పోరాడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వర్సిటీల అధ్యాపక ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో కాంట్రాక్టు అధ్యాపకులు అన్ని వర్సిటీలలో ఆందోళన బాట పట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 12 వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులు ఒకే సారి నిరవధిక సమ్మె చేయడంతో ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకుల నాయకులతో సంప్రదింపులు జరిపి ఉద్యోగ భద్రత, యూజీసీ ప్కే స్కేల్ అమలు చేస్తామని అంగీకరించడంతో సమ్మెను తాత్కాలికంగా ముగించినట్లు అధ్యాపకులు పేర్కొన్నారు. ఉద్యోగాల పర్మనెంట్ మినహా ఇతర డిమాండ్ల పై పార్టుటైం అధ్యాపకుల సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వం సుముకతను వ్యక్తం చేసిన్నట్లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాల అందజేత




సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: పేదరికం కారణంగా మెరుగైన వైద్యం చేయించుకోలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఇద్దరికి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అండగా నిలిచారు. రాంగోపాల్‌పేట డివిజన్ చుట్టాల బస్తీకి చెందిన మహేష్, బన్సీలాల్‌పేట డివిజన్ అరుణ్‌జ్యోతి కాలనీకి చెందిన ఇల్లందుల పావనిలు గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంఇ పడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి కోరారు. ఎమ్మెల్యే చొరవతో వారికి ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరైంది. బుధవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు ఆర్థిక సహాయం మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో బన్సీలాల్‌పేట డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకటేషన్‌రాజు, నాయకులు ప్రేమ్‌కుమార్, అబ్బాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రండి

అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్ శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు రావాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం అందజేశారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో తలసానిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు.

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత



తప్పిపోయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సనత్‌నగర్ పోలీసులు

సనత్‌నగర్: తప్పిపోయిన బాలికను సనత్‌నగర్ పోలీసులు గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన మేరకు.. నారాయణపేట, ధర్మగిద్దకు చెందిన లక్ష్మయ్య భార్య, కూతురు అంజమ్మ (7)తో కలిసి మోతీనగర్ సమీపంలోని ఫుట్‌పాత్‌లపై నివాసం ఉంటూ కూలీగా పనిచేస్తున్నాడు. 28వ తేదీన సోమవారం ఎర్రగడ్డలోని కల్లు కాంపౌండ్ సమీపం నుంచి కూతురు అంజమ్మ తప్పిపోయింది. దీంతో తండ్రి లక్ష్మయ్య అంతటా గాలించి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తీవ్రంగా గాలించిన పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించి సనత్‌నగర్‌లోని శివాజీనగర్‌లో ఓ ఇంట్లో అంజమ్మ ఉన్నట్లు గుర్తించారు. బాలిక మతిస్థిమితం లేకుండా తిరుగుతుంటే చేరదీసి వారి ఇంట్లో ఆశ్రయం కల్పించినట్లు పోలీసులు తెలుసుకున్నారు. చివరకు బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

సత్తా చాటిన ప్రభుత్వ విద్యార్థులు

రసూల్‌పురా: టెన్త్ ఫలితాల్లో మారేడుపల్లి జోన్ పరిధిలోని తిరుమలగిరి, మారేడుపల్లి మండలాల పరిధిలోని 14 ప్రభుత్వ పాఠశాలకు చెందిన 647 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 566 మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందారు. జోన్ పరిధిలో 87 శాతం ఉత్తీర్ణత సాధించారు. తిరుమలగిరి బాలికల ప్రభుత్వ పాఠశాల, వెస్ట్‌మారేడుపల్లి పాఠశాల విద్యార్థులు 95 శాతం ఫలితాలు సాధించి టాప్‌లో నిలిచారు. బొల్లారం ప్రభుత్వ బాలికల పాఠశాల 94 శాతం, పికెట్ పాఠశాల 92, బొల్లారం (బీఆర్) బాలుర ఉన్నత పాఠశాల, 89, తిరుమలగిరి బాలుర పాఠశాల, బొల్లారం బాలుర పాఠశాలలు 87శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఆతర్వాత వరుసగా మడ్‌ఫోర్ట్ పాఠశాల 81, బోయిన్‌పల్లి బాలికల పాఠశాల 80 శాతం ఉత్తీర్ణత సాధించాయి. 73 శాతం ఫలితాలతో బోయిన్‌పల్లి బాలుర పాఠశాల చివరి స్థానంలో నిలిచింది. ఇక సికింద్రాబాద్ మండల పరిధిలోని బాలంరాయి నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాల్లో 86 శాతంతో విద్యార్థులు ఉత్తీర్ణత పొందారు. పాఠశాల టాపర్‌గా తేజశ్రీ 534 మార్కులు సాధించింది. మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ పాఠశాల్లో 93 శాతంతో కొలను శరణ్య 557 మార్కులు, 90శాతంతో శీలా తేజ్ రావు పవార్ 542 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచారు.

లాలాపేట: పదవ తరగతి ఫలితాల్లో లాలాపేటలోని ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధించాయి. లాలాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల గడి స్కూల్ వంద శాతం ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో నిలిచింది. ఇంగ్లీషు మీడియంలో 33 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. పి. రమ్య 531 మార్కులతో స్కూల్ ఫస్ట్ నిలిచింది. ఎం. వినయ్‌కుమార్ 505 మార్కులు, వర్ష శ్రీ 494 శాతంతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

- లాలాపేటలోని బాలికల ఉన్నత పాఠశాల మార్కెట్ స్కూల్‌లో మొత్తం 41 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 39 మంది విద్యార్థులు పాసై 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి తెలియజేశారు. బి. వర్షిత 514లో మార్కులతో స్కూల్ టాఫర్‌గా నిలిచింది. చిలుక శ్రీనిధి 512 మార్కులతో స్కూల్ సెకండ్ నిలిచారు.



పి. రమ్య, లాలాపేట గడి స్కూల్ (531)



బి. వర్షిత (514) లాలాపేట మార్కెట్

రెండు పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత


రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ మండల పరిధిలోని రెండు ప్రభుత్వ పాఠశాలలు పదవ తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. మండల పరిధిలో 15 ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతుండగా 501 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 416 మంది ఉత్తీర్ణులయ్యారు. బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో సికింద్రాబాద్ మండలంలో ఓవరాల్‌గా 83 శాతం ఉత్తీర్ణత వచ్చింది. నల్లగుట్ట ప్రభుత్వ బాలికల పాఠశాల (న్యూ), ఆదయ్య మెమోరియల్ హైస్కూల్‌లు వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. మూడు పాఠశాలలు 90 శాతంకు పైగా ఉత్తీర్ణత సాధించాయి. 500కు పైగా మార్కులు 14 మంది విద్యార్థులు సాధించారు. ప్రభుత్వ పాఠశాల బండిమెట్‌కు చెందిన తేజ శ్రీనివాస్ 547 మార్కులతో మండలంలో టాప్‌గా నిలిచాడు. ప్రభుత్వ పాఠశాల వైఎంసీఏ సికింద్రాబాద్‌కు చెందిన సమీరా, నల్లగుట్ట ఓల్డ్‌కు చెందిన సమీనాబేగంలు 543 మార్కులు, బన్సీలాల్‌పేట్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన రవిశంకర్ తివారి, నల్లగుట్ట బాలంరాయికి చెందిన తేజశ్రీలు 534 మార్కులు సాధించారు.

సికింద్రాబాద్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సీతాఫల్ మండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 97శాతం ఉత్తీర్ణత సాధించారు. ఆంగ్ల మీడియంలో మొత్తం 40మంది పరీక్షలు రాయగా 38మంది పాసయ్యారు. తెలుగు మీడియంలో 15 మందికి గాను అందరూ పాసయ్యారు. జి. ప్రశాంత్ 533 మార్కులు సాధించి స్కూల్ టాపర్ గా నిలవగా ఎస్. విజయ్ 509 మార్కులు సాధించాడు.


అమీర్‌పేట: అమీర్‌పేట ప్రభుత్వ స్కూలు విద్యార్థులు టెన్త్‌లో ప్రతిభ కనబరిచారు. మొత్తం 137 మంది పరీక్షలకు హాజరు కాగా 127 మంది ఉత్తీర్ణులైయ్యారు.ఎం.అషిత అనే విద్యార్థిని 540 మార్కులు సాధించగా నగీనబాయి 539,రోష్ని 535 మార్కులు సాధించింది.

అడ్డగుట్ట స్కూల్‌లో 76శాతం ఉత్తీర్ణత

అడ్డగుట్ట: పదో తరగతి పరీక్షల్లో అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 76శాతం ఉత్తీర్ణత సాధించారు. పదో తరగతిలో మొత్తం 72 మంది ఉండగా అందులో 55 మంది ఉత్తీర్ణులైనట్లు మారేడుపల్లి డిప్యూటీ ఐఓఎస్ మదన్ మోహన్ తెలిపారు. అడ్డగుట్టకు చెందిన ఏ. హారిక 542 మార్కులు, జీ. బ్రమరాంభిక 528 మార్కులు సాధించినట్లు తెలిపారు. గత సంవత్సరంలో 71 శాతం ఉత్తీర్ణత సాధించిన అడ్డగుట ప్రభుత్వ పాఠశాల ఈ సారి 76 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డిప్యూటీ ఐఓఎస్ మదన్ మోహన్ వెల్లడించారు.



హారిక (542)



భ్రమరాంబిక (528)